పాలిథిన్ వినియోగిస్తే ట్రేడ్ లైసెన్స్‌ల రద్దు

విస్తృతంగా దాడులు చేపట్టిన జీవీఎంసీ అధికారులు


భీమిలిలో పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము


తగరపువలసలో వ్యాపారుల నుంచి స్వాధీనం చేసుకున్న పాలిథిన్‌తో సచివాలయ సిబ్బంది

కొమ్మాది: పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము హెచ్చరించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు గురువారం 1, 2, 3, 4 వార్డుల్లో ప్లాస్టిక్ నిషేధంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దుకాణాలు, మార్కెట్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ – 1లోని 387 షాపుల్లో తనిఖీలు నిర్వహించి 39.1 కేజీల పాలిథిన్ కవర్లు సీజ్ చేశారు. రూ.24,400ల ఫైన్ వేసినట్లు జెడ్సీ రాము తెలిపారు. వీధి వ్యాపారులకు


మధురవాడ హైవేపై ఆటోలు తనిఖీ చేస్తున్న జీవీఎంసీ అధికారులు

రూ.500, చిన్న దుకాణాలకు రూ. 2 వేలు, పెద్ద దుకాణాలు, మాల్స్, పెద్ద హోటల్స్‌కు రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తామన్నారు. మొదటి సారి అతిక్రమణకు జరిమానా విధిస్తామని, రెండో సారి అతిక్రమణకు జరిమానా రెండింతలు, మూడోసారి పునరావృతమైతే సదరు వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా వార్డు సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్లు, ఏఎంఓహెచ్‌లు, అన్ని డిపార్టుమెంట్ల అధికారులు ప్లాస్టిక్ వినియోగంపై దాడులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యాపారులకు రూ.50 వేల జరిమానా

తగరపువలస : జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు వివిధ సచివాలయాల సిబ్బంది, హెచ్‌వోడీలు, శానిటేషన్ కార్యదర్శులు, భీమిలి జోన్ సిబ్బంది తగరపువలస, భీమిలి ప్రాంతాల్లో దుకాణాలపై గురువారం దాడులు చేసి నిషేధిత పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం, విక్రయాలపై నిషేధం ఉన్నా ఎందుకు వినియోగిస్తున్నారని వ్యాపారులను ప్రశ్నించారు. సుమారు 40 కిలోల పాలిథిన్ వ్యర్థాలు స్వాధీనం చేసుకుని రూ.50 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా జెడ్సీ బి.రాము మాట్లాడుతూ పాలిథిన్‌పై నిషేధం నిరంతరం ఉంటుందని, అలాగే వినియోగంపై నిఘా ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు, వ్యాపారులు తమతో సహకరించాలని కోరారు.

మధురవాడ జోన్‌లో దాడులు

మధురవాడ: ప్లాస్టిక్‌పై జీవీఎంసీ యంత్రాంగం కన్నెర్ర చేసింది. గురువారం జీవీఎంసీ జోన్ – 2లోని వివిధ ప్రాంతాల్లో వైద్యాధికారి కిషోర్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి విస్తృతంగా దాడులు నిర్వహించారు. జాతీయ రహదారిపై మధురవాడ వద్ద, మిథిలాపురి వుడా కాలనీ, మధురవాడ మార్కెట్ తదితర ప్రాంతాల్లో దుకాణాలు తనిఖీ చేశారు. 212 కిలోల పాలిథిన్ కవర్లు దుకాణాల నుంచి స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.1.12 లక్షలు వరకు వ్యాపారులకు జరిమాన విధించారు.

చెరువు నీరు మళ్లించేందుకు మల్లగుల్లాలు

అందరితో చర్చించిన జెడ్సీ రాము


స్థానికులతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస చెరువు నుంచి నీటిని బయటకు పంపించేందుకు స్థానిక ప్రజలు, రైతులతో గురువారం ఉదయం భీమిలి జెడ్సీ బొడ్డేపల్లి రాము చర్చించారు. చెరువు నీటిని ఉత్తర దిశలో ఉన్న మదుం ద్వారా పంపిస్తే పంట పొలాలు మునుగుతాయని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పడమర దిశలో ఉన్న సత్యకల్యాణి లే అవుట్ ద్వారా పంపించడానికి అక్కడి వారు అంగీకరించ లేదు. ప్రత్యామ్నాయంగా సంగివలస కాలనీ వైపు చెరువును ఆనుకుని కాలువ తవ్వించడానికి తాత్కాలికంగా ప్రతిపాదించారు. అయినప్పటికీ ఆ కాలువ ద్వారా మురుగు నీటిని ఎటువైపు మళ్లించాలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. వర్షాకాలంలో చెరువు ముంపునకు గురైతే ఈ సమస్య తమకు మరింత జటిలంగా మారుతుందని సత్యకల్యాణి లే అవుట్, సంగివలస కాలనీ ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు, ఏఈ సుమన్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, న్యాయవాది చోడిపల్లి జయసాయి, పీతల వెంకట అప్పారావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యుదయ కవి శ్రీశ్రీకి నివాళి


శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు

తగరపువలస: సినీ గేయ రచయిత, ప్రముఖ అభ్యుదయ కవి శ్రీరంగం శ్రీనివాసరావు 40వ వర్ధంతి సందర్భంగా భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆయన చిత్రపటానికి గురువారం నివాళులర్పించారు. ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీశ్రీ జీవిత చరిత్రను వివరించారు. విశాఖ వాసి అయిన శ్రీశ్రీ విద్యాభ్యాసం నగరంలోని ఏవీఎన్ కళాశాలలో జరిగిందన్నారు. ఆకలిరాజ్యం సినిమాలోని పాటకు రాష్ట్రపతి అవార్డు లభించిందన్నారు. ''జగన్నాథ రథచక్రాలు''తో అందరి మన్ననలు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆర్.అప్పలరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎస్.రమేష్, బి.మల్లిక, పి.నాగమణి తదితరులు శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

భీమునిపట్నం: భీమిలి జమ్మి చెరువు ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరిలోవకు చెందిన వెంకటలక్ష్మి (30) భర్తతో గొడవ పడి గురువారం ఉదయం ఈ ప్రాంతానికి చేరుకుంది. బాత్‌రూమ్ శుభ్రపరచడానికి ఉపయోగించే లిక్విడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఈ క్రమంలో వాంతులు చేసుకుని అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతున్నారు.

క్లుప్తంగా

షూటింగ్ సందడి


షూటింగ్ లొకేషన్‌లో చిత్ర యూనిట్

కొమ్మాది: సుహి ఎంటర్‌టైన్‌మెంట్ ఇంటర్నేషనల్ పతాకంపై మరాఠీ, బెంగాలీ, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కిస్తున్న జోడీ శంభర్ శంభర్ చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను గురువారం ఎండాడ, ఆరిలోవ ప్రాంతాల్లో చిత్రీకరించారు. అజ్గర్ ఆలీ దర్శకత్వంలో గెద్దం ప్రవీణ్ నిర్మిస్తున్న ఈ సినిమాలో హీరోగా ప్రమోద్ సాకరే, హీరోయిన్‌గా ప్రియాంక నటిస్తున్నారు. మరో రెండు రోజులపాటు బీచ్ రోడ్ పరిసరాల్లో ఈ సినిమా షూటింగ్ చిత్రీకరణ ఉంటుందని మేనేజర్ బి.రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొమ్మాది: వైజాగ్ నుంచి ద్విచక్ర వాహనంపై పి.శంకర్ భీమిలి వైపు వస్తుండగా తిమ్మాపురం వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు దగ్గరలో ఉన్న ఆస్పత్రికి శంకర్‌ను తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నాడు.

'ఇంగ్లిష్ ఉపాధ్యాయులపై భారం తగ్గించండి'

తగరపువలస: రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధనా మండలి సంచాలకులు జారీ చేసిన విద్యా విషయక అకడమిక్ క్యాలెండర్‌తో ఇంగ్లిష్ ఉపాధ్యాయులపై పని భారం పెంచడంతోపాటు అశాస్త్రీయతంగా ఉందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, ఆదెయ్య అన్నారు. 3 నుంచి 10వ తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో 3, 4, 5 తరగతులకు వారంలో 14 వంతున 42 పీరియడ్లు, 6 నుంచి 10 వరకు ఉన్న పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులకు వారంలో 9 వంతున, 10వ తరగతికి 6 పీరియడ్ల బోధన కష్టమన్నారు. వీటిలో సాధారణ పీరియడ్లతోపాటు టోఫెల్ పీరియడ్లు, వుయ్ లవ్ రీడింగ్ పీరియడ్లు ఉన్నాయన్నారు. వారంలో మొత్తం 48 పీరియడ్లకు 45 బోధనకే కేటాయిస్తే ఉపాధ్యాయుల సంసిద్ధతకు అవకాశం ఉండదన్నారు. ఒకే సెక్షన్‌తో నడిచే 3 నుంచి 8 లేదా 6 నుంచి 10వ తరగతులు ఉన్న పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉంటే 42 నుంచి 45 గంటల పని భారం ఉంటుందన్నారు. అలాగే 3 నుంచి 10 వరకు ఉన్న పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నా ఇదే పని భారం ఉంటుందన్నారు. అందువల్ల ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులపై భారం తగ్గించాలని కోరారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసీపూజ


సహస్ర తులసీ పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ : కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద నిరశన తెలుపుతున్న కార్మికులు

మధురవాడ: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జీవీఎంసీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎమ్‌వీ ప్రసాదరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద గురువారం నిరశన తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ 482 డెత్, సిక్, 60 సంవత్సరాలు నిండినవి, లాంగ్ ఆబ్సెంట్, తదితర పోస్టులు భర్తీ చేయాలని కోరారు. క్లాప్ డ్రైవర్లకు ప్రభుత్వ జీవో ప్రకారం రూ.18,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెటర్నరీ, యూజీడీ, పార్కులలో పనిచేసే వారికి హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్పందించకపోతే 19 నుంచి సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు.

మహిళా మార్టుతో సరసమైన ధరలకే సరకులు


మహిళా మార్టు పరిశీలిస్తున్న పీడీ శోభారాణి

ఆనందపురం : మండల కేంద్రమైన ఆనందపురంలో ఏర్పాటు చేస్తున్న చేయూత మహిళా మార్టు ద్వారా సరసమైన ధరలకే సరకులు అందిస్తామని డీఆర్‌డీఏ పీడీ శోభారాణి చెప్పారు. గురువారం ఆమె మార్టు నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మహిళల నిర్వహణలోనే మార్టు ఉంటుందని... ఇంటికి అవసరమైన అన్ని రకాల నిత్యావసర సరకులు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. మండలంలో గల అన్ని డ్వాక్రా సంఘాల మహిళలను చేయూత మహిళా మార్టులో భాగస్వాములను చేశామని చెప్పారు. ఆమె వెంట ఏపీఎం నాగభూషణరావు తదితరులు ఉన్నారు.

నిడిగట్టులో గ్రామ సభ

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు సచివాలయం పరిధి ఆర్‌వై అగ్రహారంలో గురువారం లాండ్ పూలింగ్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ అసైన్డ్ భూములకు డి పట్టాలతో సంపూర్ణ యాజమాన్య హక్కులు పొంది విక్రయించుకునేందుకు మంచి అవకాశం అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 47.07 ఎకరాలను రైతులు లాండ్ పూలింగ్‌కు ఇచ్చేందుకు అంగీకరించినట్లు ఆయన తెలిపారు.

సీఎం జగన్‌తో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ


కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు


మద్ది గ్రామంలో జగనన్న విద్యా కానుకలతో విద్యార్థులు, నాయకులు


విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుచూపుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయని పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు అన్నారు. చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులకు జగనన్న విద్యా కానుకలు, స్టీల్ కంచాలతోపాటు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జగనన్న ఆణిముత్యాల అవార్డులను గురువారం అందించారు. వీరిలో 545 మార్కులు సాధించిన కందివలస ప్రవళిక, 497 మార్కులు సాధించిన మర్రిన పూజిత, 491 మార్కులు సాధించిన శెట్టి చాందిని ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ కష్టానికి తగ్గ ఫలితాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు సమిష్టిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పచ్చిపాల కుమారి, ఉపాధ్యాయినులు రాణి, పీవీ లక్ష్మి, సావిత్రి, మాధవి, రామలక్ష్మి, భీమాబాయి, భాగ్యవతి, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ ఎంపీయూపీ పాఠశాలలో గురువారం 4వ విడత జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు అందజేశారు. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి నేటి తరం రుణపడి ఉంటుందన్నారు. విద్య కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పరదేశి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తర్లువాడలో ఉన్నత పాఠశాలలో పంపిణీ

ఆనందపురం : మండలంలోని తర్లువాడ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలు తెరిచిన రోజే పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారం పంపిణీ చేయడం వల్ల విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి తల్లిదండ్రులు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.జ్యోతి, పీఎంసీ చైర్మన్ బాలి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం జగనన్న విద్యా కానుకలను విద్యార్థులకు నాయకులు పంపిణీ చేశారు. మద్ది ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, బుగత శ్రీనివాసరావు కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బుగత ఈశ్వరమ్మ పాల్గొన్నారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలామణి పాల్గొన్నారు.


చిట్టివలస బాలికల హైస్కూల్‌లో అవార్డులు అందిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు

శిథిల డ్రైనేజీలతో అవస్థలు


శిథిలమై ఆకారం కోల్పోయిన కాలువ


40 ఏళ్ల కిందట నిర్మించిన కాలువ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు కుమ్మరివీధిలో 40 ఏళ్ల క్రితం తగరపువలస పంచాయతీగా ఉండగా నిర్మించిన కాలువలు మళ్లీ ఇన్నేళ్లయినా మరమ్మతులకు, పునరుద్ధరణకు నోచుకోలేదు. ప్రసిద్ధి చెందిన తూర్పు వైపు తగరపువలస – భీమిలి రోడ్డు, దక్షిణ దిశలో ఆంధ్రా బ్యాంకు – తాతా థియేటర్ రోడ్లను ఆనుకుని కేవలం 20 మీటర్ల దూరంలో ఉన్న ఈ వీధిలో చూస్తే పూర్వం ఇక్కడ మురుగునీరు ప్రవహించే కాలువలు ఉండేవని తెలుస్తుంది. నాలుగు దశాబ్దాల క్రితం భోగాపురం సమితిలో తగరపువలస, చిట్టివలస పంచాయతీలుగా ఉండేవి.

అప్పట్లో ఇటుకలతో నిర్మించిన కాలువల ఆనవాళ్లే నేలమట్టమై ఇప్పటికీ కనిపిస్తున్నాయి. తగరపువలస, చిట్టివలస పంచాయతీలు తర్వాత కాలంలో భీమిలి మున్సిపాల్టీలో విలీనం కావడం, భీమిలి మున్సిపాల్టీ జీవీఎంసీలో కూడా విలీనం అయిపోయాయి. అయినప్పటికీ తగరపువలస కుమ్మరివీధిలో మురుగునీరు, వర్షం నీరు పోయేందుకు దారులు లేకుండా పోయాయి. ఏ రోజుకారోజు ఇక్కడి వారు నేలమట్టమైన కాలువలను శుభ్రం చేసుకోకపోతే మురుగు, వర్షం నీరు మధ్యే గడపాల్సి వస్తోంది.

కార్పొరేటర్ గారూ గుర్తున్నామా...?

రెండేళ్ల క్రితం జీవీఎంసీకి ఎన్నికలు జరిగినప్పుడు 2వ వార్డు ప్రజలు టీడీపీ అభ్యర్థి గాడు చిన్నికుమారి లక్ష్మికి ఓట్లేసి కార్పొరేటర్‌గా గెలిపించారు. ఎన్నికలు పూర్తయి ప్రస్తుతం 27 నెలలు పూర్తవుతున్నా ఆమె వార్డులో పర్యటించిన సందర్భాలు దాదాపు శూన్యం. అంతకు ముందు భీమిలి మున్సిపాల్టీకి సంబంధించి ఈ వార్డులో వరుసగా టీడీపీ కౌన్సిలర్లే గెలుస్తూ వచ్చారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్కరూ కుమ్మరివీధిలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించిన పాపాన పోలేదు. ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సందర్భాల్లో ఎవరూ ఇటువైపు చూడటం లేదని కుమ్మరివీధి ప్రజలు వాపోతున్నారు.

ఎమ్మెల్యేకు సమస్య చెబుతాం



కుమ్మరివీధిలో రాజకీయ చైతన్యం కలిగిన వారు లేరు. అందువల్ల ఇక్కడి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ఇటీవల సచివాలయాలు ఏర్పాటు కావడంతో కాలువల కోసం ఫిర్యాదు చేశాము. ఇప్పుడు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసి మా సమస్య చెప్పుకుంటాం.

– పొట్నూరు రామచంద్రరావు, సంతపేట

తక్షణమే డ్రైనేజీలు నిర్మించాలి



కుమ్మరివీధిలో తక్షణమే డ్రైనేజీలు నిర్మించాలి. వచ్చేది వర్షాకాలం కావడంతో మనుగడకు ఇబ్బందిగా ఉంటుంది. ప్రస్తుతం శిథిలమైన డ్రైనేజీలను చీపుర్లతో శుభ్రం చేసుకుంటున్నా... వర్షాకాలంలో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక ఇళ్లలోకి చేరిపోతుంది. జీవీఎంసీ అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలి.

– కొప్పాక సత్యనారాయణ, సంతపేట

అధ్వానంగా అంతర రహదారులు


ప్రధాన రహదారి నుంచి ఆర్‌హెచ్ కాలనీకి వెళ్లే రోడ్డులోని గతుకుల్లో నిలిచిన వర్షం నీరు

పీఎం పాలెం : జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం నిర్లక్ష్యపు వైఖరికి పీఎం పాలెంలోని వివిధ కాలనీల అంతర రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పీఎం పాలెం ప్రధాన రహదారి నుంచి ఆర్‌హెచ్ కాలనీకి వెళ్లే రోడ్డులో ఏర్పడిన గతుకులు కారణంగా చిన్న పాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోతోంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్ లేకపోతే చీకటిలో ఈ రోడ్డులో ప్రయాణించడం దుర్భరంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి గతుకులు పూడ్చాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

తగరపువలస: భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేటలో గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో మూడు ముక్కలై విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జీరుపేట కూడలిలో లోడుతో ఉన్న లారీ వెనుకకు మళ్లిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రాత్రి వేళ స్తంభాన్ని పునరుద్ధరించడం సాధ్యం కాకపోవడంతో శుక్రవారమే పునరుద్ధరించనున్నారు. జీరుపేట వాసులు రాత్రంతా విద్యుత్ సరఫరా లేకుండానే చీకటి, ఉక్కపోతతో గడపాల్సి ఉంది.

అంధకారంలో బొగ్గురోడ్డు..

మరొకవైపు చిట్టివలస, చిల్లపేట బొగ్గురోడ్డులో కొంతకాలంగా విద్యుత్ స్తంభాలకు అమర్చిన లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ రోడ్డులో సుఖీభవ కాలనీలో కూడా పూర్తిగా వీధిదీపాలు వెలగడం లేదని, వాటిని పునరుద్ధరించాలని కాలనీ, బొగ్గురోడ్డు వాసులు కోరుతున్నారు.

19 నుంచి రథోత్సవాలు

భీమునిపట్నము: స్థానిక జగన్నాథ స్వామి దేవాలయంలో 19 (సోమవారం) నుంచి 29 వరకు శ్రీ సుభద్ర జగన్నాథ స్వామి రథోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ ఆర్.సింగరాచార్యులు చెప్పారు. ఉదయం 7.45 గంటలకు నేత్రోత్సవాలు, సాయంత్రం జగన్నాథుని కల్యాణం నిర్వహిస్తారన్నారు. 20న వార్షిక తొలిపూజ, సాయంత్రం 4.30 గంటలకు జగన్నాథ, పరివార దేవతల శోభాయాత్ర (రథయాత్ర) ఉంటుందని తెలిపారు. ఈ నెల 21 నుంచి 29 వరకు స్వామి మత్స్య అవతారం మొదలు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే ఆధ్యాత్మిక, ఆరాధన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.